కొవిడ్ టీకా మార్గదర్శకులకు వైద్య నోబెల్

- కాటలిన్ కరికో, డ్రూ వెయిస్‌మన్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం
- ఎంఆర్ఎన్ఏ ఆధారిత కరోనా టీకాల అభివృద్ధిలో వీరి పరిశోధనలే కీలకం

స్టాక్‌హోమ్, అక్టోబర్ 2: కరోనా టీకాల అభివృద్ధికి మార్గం చూపిన ఇద్దరు శాస్త్రవేత్తలకు ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం వరించింది. ఎంఆర్ఎన్ఏ ఆధారిత కరోనా వ్యాక్సిన్ల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన కాటలిన్ కరికో (హంగేరి), డ్రూ వెయిస్‌మన్‌లకు (అమెరికా) ఈ ఏడాది వైద్య శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. నోబెల్ అసెంబ్లీ సెక్రెటరీ థామస్ పెర్ల్‌మాన్ సోమవారం ఈ పురస్కారాలను ప్రకటించారు. కొవిడ్ రూపంలో మానవాళికి పెను ముప్పు తలెత్తిన తరుణంలో వేగవంతంగా ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడంలో వీరి పరిశోధనలే కీలకంగా మారాయని నోబెల్ ప్యానల్ కొనియాడింది. గత ఏడాది స్వీడన్‌కు చెందిన స్వాంటె పాబోకు వైద్య నోబెల్ లభించింది.

2005లో పరిశోధనలు.. ఇప్పుడు గుర్తింపు

హంగేరికి చెందిన కాటలిన్, అమెరికా జాతీయుడైన డ్రూ వెయిస్‌మన్.. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లపై పరిశోధనలు చేశారు. 1990ల్లోనే ఈ తరహా వ్యాక్సిన్లను అభివృద్ధి చేయాలనే ఆలోచన పరిశోధకులకు వచ్చింది. అయితే పెన్సిల్వేనియా యూనివర్సిటీలో సహోద్యోగులైన కాటలిన్, డ్రూ 2005లో దీన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. అయితే అప్పట్లో వారి కృషిని ఎవరూ గుర్తించలేదు. కానీ కరోనా మహమ్మారితో పోరాటంలో వ్యాక్సిన్ల అభివృద్ధి చేయడంలో వీరి పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వారి డాటాను ఉపయోగించి ఫైజర్, బయోటెక్, మోడెర్నా కంపెనీలు కొవిడ్ వ్యాక్సిన్లను అభివృద్ధి చేశాయి.

నగదు బహుమతి పెంపు...

డిసెంబర్ 10న కాటలిన్, డ్రూకు నోబెల్ పురస్కారంతో పాటు బంగారు పతకం, నగదు బహుమతి అందజేస్తారు. ఈ వారం మొత్తం వరుసగా వివిధ రంగాల్లో నోబెల్ బహుమతులను ప్రకటించనున్నారు. ఫిజిక్స్ (మంగళవారం), కెమిస్ట్రీ (బుధవారం), సాహిత్యం (గురువారం), శాంతి పురస్కారం (శుక్రవారం), అర్థశాస్త్రం (అక్టోబర్ 9న) పురస్కారాలను ప్రకటించనున్నట్టు నోబెల్ కమిటీ తెలిపింది. మరోవైపు నోబెల్ పురస్కార గ్రహీతలకు ఇచ్చే నగదు బహుమతిని కూడా పెంచారు. తాజాగా పురస్కారం అందుకునే వారికి 11 మిలియన్ల స్వీడిష్ క్రోనర్లు (ఒక మిలియన్ యూఎస్ డాలర్లు) అందించనున్నారు. కాగా, శాంతి పురస్కారాన్ని ఓస్లోలో, మిగతా రంగాల వారికి స్టాక్‌హోమ్‌లో అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతిని పురస్కరించుకొని డిసెంబర్ 10న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

అసలేంటీ ఎంఆర్ఎన్ఏ?

బలహీనమైన వైరస్ లేదా అచేతనమైన వైరస్‌లను ఉపయోగించి సాధారణ వ్యాక్సిన్లను తయారు చేస్తారు. అయితే ఇవి కొన్ని ఇన్‌ఫెక్షన్లపై సమర్థంగా పని చేయవు. అందుకే ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ల అభివృద్ధిపై కాటలిన్, డ్రూ దృష్టి సారించారు. ఎంఆర్ఎన్ఏ లేదా మెసెంజర్ ఆర్ఎన్ఏ అనేది జన్యు అణువు. కణాల్లో ప్రొటీన్ సంశ్లేషణలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. కణాల న్యూక్లియస్‌లోని డీఎన్ఏ, రైబోసోమ్‌ల మధ్య ఇవి మధ్యవర్తిగా పని చేస్తాయి. ఈ ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు జన్యు ప్రొటీన్లను అందిస్తాయి. ఏ ప్రొటీన్ శరీరానికి అవసరమో కణాలకు చెబుతాయి. మన రోగ నిరోధక వ్యవస్థతో ఇంటరాక్ట్ అయి వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొనేలా చేస్తాయి. ఇవి వైరల్ ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పని చేయడంలో కీలకంగా వ్యవహరిస్తాయి.

బీహార్‌లో 63% ఓబీసీలు, ఈబీసీలే

కులగణన సర్వే నివేదికను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

పాట్నా, అక్టోబర్ 2: బీహార్‌లోని నితీశ్‌కుమార్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన డాటాను సోమవారం విడుదల చేసింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 63 శాతం మంది ఓబీసీలు, ఈబీసీలు ఉన్నట్టు సర్వేలో తేలింది. రాష్ట్ర మొత్తం జనాభా 13.07 కోట్లు ఉండగా.. అందులో అత్యంత వెనుకబడిన తరగతుల(ఈబీసీ) వారు 36 శాతం, ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీ) వారు 27.13 శాతం ఉన్నారని నివేదిక వెల్లడించింది. 14.27 శాతంతో ఓబీసీ గ్రూపులోని యాదవులు రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన సామాజికవర్గంగా ఉన్నది. కులగణన డాటా ప్రకారం ఎస్సీలు రాష్ట్ర జనాభాలో 19.65 శాతం, ఎస్టీలు 1.68 శాతం(22 లక్షల మంది) మంది ఉన్నారు. అన్‌రిజర్వ్‌డ్ క్యాటగిరీకి చెందిన అగ్రకులాల వాళ్లు జనాభాలో 15.2 శాతంగా ఉన్నారని డాటా వెల్లడించింది. కులగణన సర్వే మతాల పరంగా జనాభా వివరాలను కూడా వెల్లడించింది. రాష్ట్రంలో 81.99 శాతంతో జనాభాతో మెజార్టీ మతంగా హిందువులు ఉన్నారు. తర్వాతి స్థానంలో 17.70 శాతంతో ముస్లింలు ఉన్నారు. ఇక క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, ఇతర మతాలను విశ్వసించే వారు, ఏ మతాన్ని విశ్వసించని వారి సంఖ్య మొత్తం కలిపి కూడా ఒక శాతం కంటే తక్కువే. కులగణన వంటి భారీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టిన అధికారులను సీఎం నితీశ్‌కుమార్ ప్రశంసించారు. త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి, కులాల డాటాను వివరిస్తామని పేర్కొన్నారు.

మంగళసూత్రాన్ని మింగిన బర్రె

ముంబై, అక్టోబర్ 2: మహారాష్ట్రలోని వసీం జిల్లాలో ఓ బర్రె మంగళసూత్రాన్ని మింగింది. జిల్లాకు చెందిన రైతు రామ్‌హరి భార్య స్నానం చేసేందుకు వెళుతూ.. దాణా ఉన్న గిన్నెలో రూ. లక్షన్నర విలువైన బంగారు మంగళసూత్రాన్ని దాచిపెట్టింది. ఆ విషయాన్ని మరిచిపోయిన ఆమె దాణా గిన్నెను బర్రె వద్ద ఉంచింది. మంగళసూత్రాన్ని దాణాతో పాటు బర్రె మింగేసింది. అనంతరం ఆమె పొరపాటును గ్రహించింది. పశువైద్యుడికి సమాచారమివ్వగా ఆయన శస్త్రచికిత్స చేసి మంగళసూత్రాన్ని బయటకు తీశారు.

మహా మృత్యుఘోష

నాందేడ్ ప్రభుత్వ దవాఖానలో 24 గంటల్లో 24 మంది మృతి

- వీరిలో 12 మంది నవజాత శిశువులు
- 12 మంది పాముకాటు బాధితులు
- వసతుల లేమి, సిబ్బంది కొరత వల్లే
- డబుల్ ఇంజిన్ సర్కారుపై ప్రతిపక్షాల తీవ్ర ఆగ్రహం
- థాణేలో ఇటీవల 36 గంటల్లో 22 మంది మృతి

ముంబై, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని ప్రభుత్వ దవాఖానల్లో మరణ మృదంగం మోగుతున్నది. కొద్దిరోజుల క్రితం థాణే దవాఖానలో 36 గంటల్లో 22 మంది రోగులు మరణించిన ఘటన మరువక ముందే.. నాందేడ్‌లో అలాంటిదే మరో ఘటన చోటుచేసుకుంది. నాందేడ్ ప్రభుత్వ దవాఖానలో 24 గంటల వ్యవధిలో 24మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయినవారిలో 12 మంది నవజాత శిశువులు ఉండటం అందర్నీ కలిచివేసింది. ప్రభుత్వ దవాఖానాల్లో వసతులలేమి, సిబ్బంది కొరతే ఈ మరణాలకు కారణమని బాధిత కుటుంబాలు, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనపై సీఎం ఏక్‌నాథ్ షిండేను విలేకరులు ప్రశ్నించగా, ఆయన స్పందించిన తీరు వివాదాస్పదమైంది. ఘటనపై తనకు సమాచారం లేదని సీఎం వ్యాఖ్యానించారు. అధికారుల నుంచి సమాచారం తెప్పించుకుంటానని ఆయన చెప్పారు. బీజేపీ నేతృత్వం లోని డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ మరణాలకు బాధ్యత వహించాలని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే ఆరోపించారు.

అంతా పేదలే..

పర్భణి, హింగోళి, యావత్మాల్ జిల్లాల సరిహద్దు గ్రామాల నుంచి వందలాది మంది పేదలు నిత్యం నాందేడ్‌లోని డాక్టర్ శంకర్ రావు చౌహాన్ దవాఖానకు వస్తుంటారు. పాముకాటుకు గురైన వారు ఎక్కువగా వస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. సరైన చికిత్స అందక, మందులు లేక 12 మంది నవజాత శిశువులు మరణించారని బాధిత తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. 500 మంది పేషెంట్లకు సరిపోయే ఈ హాస్పిటల్‌లో 1300మంది రోగులు అడ్మిట్ అయ్యారని, నర్సుల్లో చాలామంది బదిలీపై వెళ్లిపోగా, ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిసింది.

మందులు కొనలేకపోయాం..

> జిల్లా ప్లానింగ్ కమిటీ యంత్రసామగ్రి, ఔషధాలు, ఆపరేషన్ పరికరాలు, ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు కోసం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే ఈ ఫండ్స్ సాంకేతిక కారణాలతో మంజూరు కాకపోవడంతో మందులు కొనుగోలు చేయలేదు. దాని వలన రోగులు బయట నుంచి మందులు కొనుక్కోవాల్సి వస్తున్నది. కొద్ది రోజుల నుంచి మా దవాఖానకు అవసరం ఉన్న మందులను పక్క జిల్లా నుంచి తెప్పించి వాడుతున్నాం.
>
> - డాక్టర్ ఎస్.ఆర్ వాకోడే, నాందేడ్ జిల్లా దవాఖాన సూపరింటెండెంట్

డబుల్ ట్రబుల్ ఇంజిన్

డోలిలో ప్రసవం

మహా సీఎం దత్తత గ్రామంలో మట్టిరోడ్డే గతి

థాణేలోని పాటకీచా పాడాలో డోలిలో గర్భిణిని మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

ముంబై, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని థాణే జిల్లాలో ఓ గర్భిణి సమయానికి దవాఖానకు వెళ్లలేక నడిరోడ్డుపైన్నే ప్రసవించింది. సీఎం ఏక్‌నాథ్ షిండే సొంత నియోజకవర్గం, ఆయన దత్తత తీసుకున్న గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. షాపూర్ తాలుకాలో పాటకీచా పాడా గ్రామానికి చెందిన ప్రణాళి వాఘేను డోలిలో తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ప్రసవించింది. సమీపంలోని ఓ గ్రామం వద్ద ఆశా వర్కర్లు వాహనం ఏర్పాటుచేయగా, అక్కడ్నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లి బిడ్డ సురక్షితంగా ఉన్నారని ఆరోగ్య కేంద్రం డాక్టర్ సువేదిక సొనావణే తెలిపారు. కాగా, 2018లోనే గ్రామానికి రోడ్డు మంజూరైనా.. ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదు. దీంతో వర్షాకాలంలో అష్టకష్టాలు పడాల్సి వస్తున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యం చేరని స్వచ్ఛ భారత్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

> హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 అక్టోబర్ 2న ప్రారంభించిన 'స్వచ్ఛభారత్' మిషన్ అనుకొన్న లక్ష్యాలను చేరుకోలేకపోయింది. రూ.80 వేల కోట్లకు పైగా నిధులు వెచ్చించినప్పటికీ, ఆశించిన ఫలితాలు దక్కలేదని, మెజారిటీ నిధులు పక్కదారిపట్టాయని రూఢీ అయ్యింది. ఈ మేరకు దేశంలోని 340 జిల్లాల్లో పబ్లిక్ టాయ్‌లెట్ల పరిస్థితిపై సోషల్ మీడియా వేదిక 'లోకల్ సర్కిల్స్' ఇటీవల ఓ సర్వే నిర్వహించింది.



మణిపూర్‌లో నిరవధిక బంద్

- చురాచంద్‌పూర్ జిల్లాలో గిరిజన కుకీ సంఘాల పిలుపు
- సీబీఐ, ఎన్ఐఏ అక్రమ అరెస్టులు చేస్తున్నాయని ఐటీఎల్ఎఫ్ ఆరోపణ
- అరెస్టు చేసిన వారిని 48 గంటల్లోగా విడుదల చేయాలని డిమాండ్

చురాచంద్‌పూర్‌లో బారికేడ్లు ఏర్పాటు చేసి పహారా కాస్తున్న పోలీసులు

ఇంఫాల్, అక్టోబర్ 2: మణిపూర్ హింసాకాండ ఘటనలకు సంబంధించి అనుమానితుల పేరుతో కేంద్ర దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఎన్ఐఏ అక్రమంగా తమ వర్గానికి చెందిన వారిని అరెస్టు చేస్తున్నాయని గిరిజన కుకీ గ్రూపు ఇండిజీనస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం(ఐటీఎల్ఎఫ్) ఆరోపించింది. గత 48 గంటల్లో ఇద్దరు మైనర్లతో సహా ఏడుగురిని అరెస్టు చేశారని పేర్కొన్నది. అరెస్టులకు నిరసనగా కుకీ సంఘాలు చురాచంద్‌పూర్ జిల్లాలో సోమవారం 10 గంటల నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్ ప్రభావంతో చురాచంద్‌పూర్‌లో సాధారణ జనజీవనం స్తంభించింది. మార్కెట్లు, ఇతర వ్యాపారాలు మూతపడ్డాయి. 48 గంటల్లోగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని ఐటీఎల్ఎఫ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. లేకుంటే రాష్ట్రంలోని అన్ని పర్వత ప్రాంత జిల్లాల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించింది. సోమవారం నుంచి మైతీలతో సరిహద్దు పంచుకొనే ఏరియాలను మూసివేస్తామని, బఫర్ జోన్ల నుంచి బయటకు వెళ్లేందుకు లేదా లోపలికి ప్రవేశించేందుకు ఎవరినీ అనుమతించమని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు కూడా మూతపడుతాయని ఐటీఎల్ఎఫ్ పేర్కొన్నది.

రెండు రోజుల్లో ఐదు అరెస్టులు

మణిపూర్ హింసలో అంతర్జాతీయ కుట్ర ఆరోపణలపై ఎన్ఐఏ చురాచంద్‌పూర్‌కు చెందిన సెమిన్లున్ గాంగ్టేను శనివారం అరెస్టు చేసింది. మరోవైపు ఇటీవల వెలుగులోకి వచ్చిన ఇద్దరు మైతీ విద్యార్థుల హత్యకు సంబంధించి సీబీఐ ఇదే చురాచంద్‌పూర్‌లో నలుగురు కుకీ వ్యక్తులను అరెస్టు చేసింది. నిందితులతో సంబంధం ఉన్న మరో ఇద్దరు మైనర్లను కూడా అదుపులోకి తీసుకొన్నది. కుకీ సంఘాల ఆరోపణల నేపథ్యంలో అరెస్టులపై సీబీఐ, ఎన్ఐఏ స్పందించాయి. సాక్ష్యాధారాల ఆధారంగానే అరెస్టు చేసినట్టు దర్యాప్తు సంస్థలు సోమవారం వెల్లడించాయి. ఏ వర్గం లేదా మతం పట్ల ఎటువంటి పక్షపాతం లేదని, కేవలం చట్టాలను మాత్రమే పాటిస్తామని అధికారులు పేర్కొన్నారు.

వచ్చి నా పక్కన నిల్చో

- నన్ను ఎవరు ప్రశ్నించారో ప్రజలు చూడాలి
- మహిళా జర్నలిస్టుతో తమిళనాడు బీజేపీ చీఫ్ అనుచిత ప్రవర్తన

చెన్నై: తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వివాదంలో చిక్కుకున్నారు. మహిళా జర్నలిస్టుతో ఆయన అనుచితంగా ప్రవర్తించడంపై విమర్శలు వస్తున్నాయి. కోయంబత్తూరులో సోమవారం అన్నామలై విలేకరులతో మాట్లాడారు. మీరు బీజేపీ చీఫ్ కాకపోయి ఉంటే పార్టీలో ఉండేవారా అని ఈ సందర్భంగా ఓ మహిళా జర్నలిస్టు ఆయన్ను ప్రశ్నించారు. అన్నామలై ఆమెను వేదికపైకి రావాలని, తన పక్కన నిల్చోవాలని పట్టుబట్టారు. తనను ప్రశ్నించిన వారిని ప్రజలు చూడాలని, తన పక్కన నిల్చోవాలని పదే పదే ఆయన వేదికపైకి పిలిచారు. దీంతో జర్నలిస్టులు ఆయన తీరును తప్పుబట్టారు. దీంతో వెనక్కి తగ్గిన అన్నామలై ఏ విధమైన ప్రశ్నలు వేయాలో జర్నలిస్టులకు సలహా ఇచ్చానని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు.

సూర్యకాంతితో షుగర్ కంట్రోల్!

న్యూఢిల్లీ: రోజంతా ఇంట్లో నాలుగు గోడల మధ్య ఉండకుండా, కాసేపు బయటకు వచ్చి సూర్యకాంతిలో నిలబడేవారికి టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని తాజా అధ్యయనం వెల్లడించింది. కృత్రిమ కాంతి, సూర్యకాంతికి లోనైన వారిలో డయాబెటిస్ ముప్పు ఎలా ఉంటుందన్నది తమ అధ్యయనం దృష్టిసారించిందని పరిశోధకులు తెలిపారు. 'జీవక్రియలు అదుపు తప్పకుండా చేయటంలో సూర్యకాంతి బలంగా పనిచేస్తుంది. చాలామంది నేడు ఇంట్లో కృత్రిమ కాంతి మధ్య గడుపుతున్నారు' అని పరిశోధనకు నేతృత్వం వహించిన ఇవో హాబెట్స్ చెప్పారు. ఆఫీస్ టైమింగ్స్‌లో కృత్రిమ కాంతి, సూర్య కాంతికి గురిచేసి, వారి రక్తంలో చక్కెర్ స్థాయిల్ని సైంటిస్టులు నమోదుచేశారు. సూర్యకాంతిలో ఎక్కువ సమయం గడిపినవారి షుగర్ స్థాయిలు పూర్తిగా నియంత్రణలో ఉండటాన్ని గుర్తించామని పరిశోధకులు వెల్లడించారు.

మహిళ కిడ్నాప్.. గ్యాంగ్‌రేప్

బీజేపీ పాలిత మధ్య ప్రదేశ్‌లో మరో దారుణం

భోపాల్, అక్టోబర్ 2: ఉజ్జయిని ఘటనను మరువకముందే మధ్యప్రదేశ్‌లో మరో దారుణం చోటు చేసుకున్నది. ఓ మహిళను కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులు, ఆమెపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పంటపొలాల్లో పడేశారు. ఆదివారం అశోక్ నగర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని బాధిత మహిళను శరోదాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. దాడికి పాల్పడ్డ నలుగురిలో ముగ్గురి పేర్లను బాధిత మహిళ పోలీసులకు తెలియజేసింది. ఘటనపై కేసు నమోదుచేశామని, నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీస్ అధికారి చెప్పారు.

యువతిపై యూపీ పోలీసుల లైంగిక వేధింపులు

ఘజియాబాద్: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో మరో షాకింగ్ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఘజియాబాద్‌లోని పార్కులో త్వరలో వివాహం చేసుకోనున్న ఓ జంటపై ఇద్దరు పోలీసులు వేధింపులకు పాల్పడ్డారు. వదిలిపెట్టాలంటే రూ.5.5 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడటమే కాకుండా తమతో లైంగిక చర్యకు రావాలని బాధిత యువతిని బలవంతం చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. దాదాపు మూడు గంటల పాటు వేధించిన తర్వాత.. పోలీసులు రూ.వెయ్యి తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం ఈ ఘటన సెప్టెంబర్ 16న జరిగినట్టు తెలుస్తున్నది. బాధితుల ఫిర్యాదు నేపథ్యంలో తాజాగా బయటకు వచ్చింది. వివరాల ప్రకారం.. బాధిత యువతి తన కాబోయే భర్తను కలిసేందుకు సాయి ఉప్వాన్ పార్క్‌కు వెళ్లింది. ఈ సమయంలో ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డు పోలీసు యూనిఫాంలో, మరో వ్యక్తి సాధారణ డ్రస్‌లో అక్కడకి వచ్చారు. వారు బాధిత జంటపై బెదిరింపులకు ప్పాలడుతూ, యువతితో అసభ్యకర్తంగా ప్రవర్తించారు. చివరకు రూ.వెయ్యి లంచం తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

డబుల్ ట్రబుల్ ఇంజిన్

భూవివాదం.. ఆరుగురి హత్య

దియోరియా: ఓ భూ వివాదంలో రెండు వర్గాల మధ్య రేగిన ఘర్షణ ఆరుగురి మృతికి దారితీసింది. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని దియోరియా జిల్లా రుద్రపూర్ ఏరియాలో చోటు చేసుకొన్నది. మృతుల్లో ఐదుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. స్పెషల్ డీజీ(లా అండ్ ఆర్డర్) ప్రశాంత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేపూర్ గ్రామంలోని ఓ భూమిపై రెండు వర్గాలకు చెందిన రెండు కుటుంబాల మధ్య చాలా కాలంగా వివాదం ఉన్నది. జిల్లా మాజీ పంచాయతీ సభ్యుడైన ప్రేమ్ యాదవ్‌ను ఆయన ఇంటిలోనే ప్రత్యర్థి వర్గం సత్యప్రకాశ్ దూబే, ఆయన కుటుంబసభ్యులు పదునైన ఆయుధాలతో దాడి చేసి చంపేశారు. దీనికి ప్రతీకారంగా అభయ్‌పూర్‌కు చెందిన ప్రేమ్ యాదవ్ మద్దతుదారులు దూబే ఇంటిపై దాడి చేశారు. దూబేతో సహా ఐదుగురు కుటుంబసభ్యులను దారుణంగా హత్య చేశారు. వీరిలో దూబే భార్య, 18 ఏండ్ల కంటే తక్కువ వయసున్న వారి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ దాడిలో మరో 8 ఏండ్ల దూబే చిన్న కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం బాలుడికి గోరఖ్‌పూర్‌లోని ఓ దవాఖానలో చికిత్స అందిస్తుండగా, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై విపక్షాలు భగ్గుమన్నాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని విమర్శించాయి. భూవివాదానికి పరిష్కారం చూపడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ హత్య ఘటనలు జరిగాయని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. హత్యలపై ఉన్నత స్థాయి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

నగ్నంగా స్తంభానికి కట్టేసి చావకొట్టారు!

- చోరీ ఆరోపణలతో బాలుడిని చితకబాదిన వ్యక్తులు
- యూపీలో అమానుషం

లక్నో, అక్టోబర్ 2: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం చోటుచేసుకొన్నది. టీ స్టాల్ నుంచి డబ్బులు దొంగతనం చేశాడన్న ఆరోపణలపై ఓ 12 ఏండ్ల బాలుడిని కొందరు వ్యక్తులు చితకబాదారు. బట్టలూడదీసి, ఓ స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టారు. ఈ ఘటన ఫిరోజాబాద్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకొన్నది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఏడుస్తూ వదిలిపెట్టాలని వేడుకొన్నా నిందితులు వదల్లేదు. బాలుడికి చేయి, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు బాధిత బాలుడిని రక్షించి, వైద్య పరీక్షల అనంతరం ఇంటికి పంపించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. దాడి చేసిన వారిలో తండ్రి, కుమారుడు ఉన్నట్టు తెలుస్తున్నది.

ఆక్స్‌ఫర్డ్ మలేరియా టీకాకు ఆమోదం

లండన్: భారత్‌కు చెందిన సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఐ) సహకారంతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ రూపొందించిన మలేరియా టీకాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆమోదం తెలిపింది. ఇది మూడు డోసుల టీకా. మలేరియాపై ఇది 75 శాతం ప్రభావవంతంగా పనిచేస్తుందని పరిశోధకులు తెలిపారు. డబ్ల్యూహెచ్‌వో ఆమోదించిన రెండో మలేరియా టీకా ఇది. రెండు నిపుణుల బృందాల సలహా మేరకు దీనికి ఆమోదం తెలిపినట్టు డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ అధనోమ్ తెలిపారు. మొదటి టీకా కంటే ఇది మరింత సమర్థవంతమైందని చెప్పారు. మలేరియా పరిశోధకుడిగా ఏదో ఒక రోజు మలేరియాకు టీకా అందుబాటులోకి రావాలని తాను కలలు కన్నానని, నేడు రెండు టీకాలు అందుబాటులో ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. 2021లో మలేరియా తొలి టీకాకు డబ్ల్యూహెచ్‌వో ఆమోదం తెలిపింది. జీఎస్‌కే సంస్థ రూపొందించిన ఈ టీకా కేవలం 30 శాతం మాత్రమే ప్రభావవంతంగా పనిచేస్తుంది.